# మిస్టరీ!

మొలుగు కమలాకాంత్



**నా**గభూషణం గారింట్లో నానా హడావిడిగా ఉంది. వచ్చేవాళ్లూ, పోయేవాళ్లూ...జనాలు...పరామర్శలు.. పోలీసుల హడావిడి అందరికంటే ఎక్కువగా ఉంది. ఇల్లంతా పరిశీలిస్తున్నారు- ఎక్కడైనా, ఏదైనా ఆధారం దొరుకుతుందేమోనని. అజాత శత్రువు, ఊళ్లో పెద్ద మనిషిగా పేరు పొందిన రెటైర్డ్ మిలటరీ ఆఫీసర్ అయిన నాగభూషణంగారు మామూలుగా పోతే ఇంత హడావిడుండేది కాదు. కానీ, గత రాత్రి ఆయన్నెవరో హత్య చేశారు, అదీ వాళ్లింట్లోనే. హత్యకు కారణాలేవీ కనబడటం లేదు. ఇంటా, బయటా కూడా శత్రువులెవరూ లేరాయనకి- అంతా మిస్టరీగా ఉంది. పోలీసు జాగిలాలు వచ్చాయి గానీ, అవి ఇంట్లోనూ, శవం చుట్టు అటూ ఇటూ తిరిగాయి. కానీ ప్రయోజనం లేకపోయింది.

నాగభూషణం గారికి 55 సం.లకు పైగా వయసుంటుంది. ఓ అయిదేళ్ల క్రితం ఆర్మీ నుంచి తిరిగి వచ్చారు. కాశ్మీర్‌లో సరిహద్దు పోరాటంలో పాల్గొన్న చరిత్ర ఉందాయనకి.

నాలుగేళ్ల క్రితమే భార్య పోయింది. ఉన్న ముగ్గురు కొడుకుల్లో పెద్దవాడు రమేష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు- భార్య లత టీచర్.

రెండోవాడు కిషోర్ అడ్వకేట్- భార్య హౌస్‌వైఫ్. మూడోవాడు హరీష్‌కి ఇంకా పెళ్ళికాలేదు... చదువుకుంటున్నాడు.

అందరికంటే ఆఖరివాడు హరీష్‌ని పట్టుకోవడం చాలా కష్టంగా ఉంది. చిన్నవాడు గదా, అందరికంటే 'ఎటాచ్‌మెంట్' ఎక్కువ.

యస్.ఐ. గోపాలరావుకి ఏమీ పాలుపోవటం లేదు. నాగభూషణం గారిని ఆయన తుపాకితోనే కాల్చి చంపారు. కనీసం వేలి ముద్రలు కూడా దొరకకుండా చేశారు.

పోనీ, ఆత్మహత్య అందామంటే; చనిపోవటానికి ముందు 'రక్షించండీ...రక్షించండీ' అన్న కేకలు విన్న కొడుకులూ, కోడళ్ళూ, పని మనిషి పాపమ్మా అంతా పరిగెత్తుకు వచ్చారు. ప్రాణం పోవడంతో పోలీసులని పిలిపించారు.

ఎక్కడా, ఏ ఆధారమూ దొరకటం లేదు... రీజన్ ఫర్ మర్డర్ కూడా అంతు చిక్కకుండా ఉంది. ఈ మిస్టరీనీ ఛేదించేదెవరు?

పిల్లలందరి దగ్గర స్టేట్‌మెంట్ తీసుకుని ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేశారు. అందర్నీ ప్రశ్నించారు. ఫలితం శూన్యం.

ఇంటి యజమాని హఠాన్మరణం అందర్నీ కలచి వేసింది... ఏడుస్తూ గడుస్తున్నాయి రోజులూ ఆ ఇంట్లో.

ఇలా ఓ నెల గడిచాక, కేసుని సి.బి.ఐ.కి అప్పగించారు.

చురుకైనవాడూ, స్ఫురద్రూపి... ఇంకా సూక్ష్మగ్రాహి కూడా అయిన యుగంధర్ సి.బి.ఐ ఆఫీసర్‌గా రంగ ప్రవేశం చేశాడు, అసిస్టెంట్ జానకిరామ్‌తో.

''జానకీ... నాగభూషణంగారు అజాత శత్రువు అంటే సిటీలో ఆయనకి శత్రువులెవరూ లేనట్టేగదూ!''

''అవునూ...''

''హంతకుడెవరో చాలా తెలివిగా, పకడ్బందీగా, ఏ ఆధారాలూ దొరకకుండా.. ఆయన తుపాకితోనే కాల్చి, వేలి ముద్రలు కూడా పడకుండా జాగ్రత్త పడ్డాడు కదూ...''

''యస్ సర్''

''అంత సన్నిహితంగా ఆయనకి అత్యంత చేరువలోకి వెళ్లి మర్డర్ చేయటమనేది ఎవరో బయటి వ్యక్తుల వల్ల జరుగుతుందని నేననుకోను''

''అంటే మీ ఉద్దేశ్యం...''

''అంటే బయట వారెవరికీ ఆ ఛాన్స్ లేదని... ఒక వేళ బయటి వాడెవడో ఆ పని చేసుంటే, డెఫినెట్‌గా పారిపోయుండాలి. కానీ పోలీస్ జాగిలాలు కూడా ఇంటి బయటికి వెళ్లినట్లు దాఖలాలు లేవు గదా!''

''అవును...కుక్కలు ఇంట్లోనూ, శవం చుట్టూ తిరిగాయి తప్ప బయటకెటూ వెళ్లలేదు'' కన్‌ఫర్మ్ చేశాడు. జానకిరామ్.

''అటువంటప్పుడు ఆ పాజిబులిటీ ఉన్నది కేవలం ఆయన కుటుంబ సభ్యులకీ లేదా నిరంతరం వాళ్లింట్లో ఉండే పని మనిషి పాపమ్మకీ...ఔనా?''

''ఔను సర్''

''ఓ.కే., మనం అట్నించి నరుక్కొద్దాం'' కదిలాడు యుగంధర్.

***

అది నాగభూషణం గారిల్లు.. ఇల్లంతా నిద్రపోతున్నట్లుగా ఉంది... విశాలమైన హాల్... నాలుగు బెడ్ రూమ్స్, కిచెన్, డైనింగ్ హాల్... సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరమైన ఇల్లు.

హాల్లో అంతా సమావేశమయ్యారు నెల్లాళ్ల తర్వాత... నాగభూషణంగారు పోయాక అంతా ఎవరి దుఃఖంలో వారు అలా రోజులు వెళ్లదీస్తున్నారే తప్ప ఇలా అంతా కలవటం ఇదే మొదటిసారి.

హత్య జరిగిన గదంతా క్షుణ్ణంగా పరిశీలించాడు యుగంధర్. ఆనాటి నుంచి ఆ గదిలోకెవ్వరూ వెళ్లటంలేదు భయంతో.


ఏదో అతి చిన్న వస్తువుని ఎవరికీ కనబడకుండా అతి చాకచక్యంగా జేబులో పెట్టుకున్నాడు.

ఆ హాల్లో మధ్యలో యుగంధర్... చుట్టూ ఆ కుటుంబ సభ్యులు, ఓ మూల పనిమనిషి పాపమ్మ.

''హత్య జరిగిన నాటి రాత్రి మీరంతా ఇంట్లోనే ఉన్నారా?'' ఉన్నామన్నట్లు తలూపారంతా.

''హత్య ఎన్ని గంటలకి జరిగింది?''

''ఆ రాత్రి 11.30 గంటల సమయంలో మామగారి గది లోంచి రక్షించమన్న కేకలు వినగానే అంతా పరిగెత్తుకుంటూ



వెళ్లాం... అప్పటికే అంతా అయిపోయింది'' బావురుమంది పెద్దకోడలు లత.

ఊరుకోమని ఓదార్చాడు భర్త రమేష్.

''ఆ రోజుగానీ, అంతకు రెండు, మూడు రోజుల ముందు గానీ ఇంట్లో ఎవరితోనైనా గొడవపడటంగానీ, తగాదాగానీ జరిగాయా?''

అడ్డంగా తలూపారంతా.

''ఆరికి పిల్లలన్నా, కోడల్లన్నా పాణమయ్యా... అట్టాంటి దేమీ ఎన్నడూ జరగలేదు బాబుగారూ'' కళ్ల నీళ్లు తుడుచుకుంటోంది పాపమ్మ.

ఎవ్వరూ రవ్వంత కూడా బటపడటం లేదు... కోడళ్లిద్దర్నీ పరిశీలనగా చూశాడు. చక్కటి అందం, అంగసౌష్ఠవం కలిగి 22-25 సం.ల మధ్య వయస్సులో ఉన్నారు.

అమాయకంగా చూస్తున్నారు.

హరీష్ కన్నీళ్లు కారుస్తూనే ఉన్నాడు.

చిన్నకోడలు రమ కాఫీ తెచ్చి ఇచ్చింది వాళ్లిద్దరికీ... రింగులు తిరిగిన జుట్టు...దోసపలుకు బొట్టుబిళ్ల... అమాకమైన కళ్లు...

''కాఫీ బావుంది'' కాంప్లిమెంట్ ఇచ్చాడు.

పెద్దకోడలు భుజాలనిండుగా చీర కప్పుకొని, పావలా బిళ్లంత బొట్టుతో సంప్రదాయబద్ధంగా ఉంది.

కొడుకులిద్దరూ ఆజానుబాహులు... మంచి మేనర్స్ ఉన్నవాళ్లు... మూడోవాడింకా చిన్నవాడు.

పాపమ్మ అమాయకంగానే ఉంది.

ఎక్కడో ఏదో 'క్లూ' దొరికినట్లనిపించింది యుగంధర్‌కి. అందరి దగ్గరా సెలవు తీసుకుని, వచ్చే ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకి కలుద్దామని చెప్పి, జానకిరామ్‌తో సహ నిష్క్రమించాడు.

***

ఒక వారం రోజులు ఆ ఇంట్లో వాళ్లందిరి మూవ్‌మెంట్స్‌ని క్షుణ్ణంగా అబ్జర్వ్ చేశారు, యుగంధర్ మరియు జానకిరామ్. కానీ, ఎవ రికీ, ఎక్కడా అనుమాన మూ వచ్చే ఛాన్సే ఇవ్వలేదు-

గమ్మత్తేమిటంటే ఎవరి మూవ్‌మెంట్స్‌లోనూ పెద్దగా తేడా ఏమీ కనబడలేదు.

***

ఆదివారం రానే వచ్చింది...

సాయంత్రం 4 గంటలకి మళ్లీ అదే హాల్లో మీటింగ్... నిశ్శబ్దంగా ఉన్న వాతావరణంలో యుగంధర్ గొంతు మంద్రంగా ఉంది.

నాగభూషణంగారీ ఇంటి దైవం... అజాత శత్రువైన అటువంటి వ్యక్తిని చంపాల్సిన అవసరం బయటి వాళ్లెవరికీ లేదు... నిస్సందేహంగా మీలో ఎవరో ఒకరు ఈ హత్య చేసి ఉండాలి...''

సూది పడితే వినబడేటంత నిశ్శబ్దం.

అందరూ మొహమొహాలు చూసుకున్నారు.

''ఏమిటి మీరు మాట్లాడేది మిస్టర్ యుగంధర్... మా కుటుంబంలోనా?'' ఉరిమినట్లుగా ఉంది పెద్దకొడుకు రమేష్ గొంతు.

''మతుండే మాట్లాడుతున్నారా?...'' కోపంగా అంది చిన్నకోడలు రమ.

''నామతి బానే ఉంది కానీ, ముందు చెప్పండి... ఎవరీ హత్య చేసింది? మీరు చెప్పకపోతే, ఆ హంతకులెవరో నేనే బయటపెట్టాల్సి వస్తుంది''

రెండు నిమిషాలు నిశ్శబ్దం రాజ్యమేలిందక్కడ.

''మిస్టర్ హరీష్... మీ నాన్నగారి హత్య గురించి నీకేమన్నా అనుమానాలున్నాయా?''

''నో... అలాంటి అవకాశమే లేదు మా ఇంట్లో'' దాదాపుగా అరిచాడు.

''పాపమ్మా... నువ్వుచెప్పు...''

''నానేటి సెప్పను బాబూ... నాకేం తెలవదు'' అంటూ ఏడుపు లంకించుకుంది.

''ఊ... ఆపు...'' గర్జించాడు జానకిరామ్.

మళ్లీ ఓ నిమిషంపాటు స్మశాన నిశ్శబ్దం...

''ఊ అయితే ఎవరూ చెప్పరన్నమాట. నేనే చెప్తున్నా వినండి... నాగ భూషణం గారిది హత్యకాదు... ఆత్మ హత్య...''

అందరూ ఆశ్చర్యంగా వింటున్నారు... కానీ వాళ్లని నిశితంగా పరిశీలిస్తున్న యుగంధర్, అక్కడి రెండుకళ్లలో 'హమ్మయ్య' అన్న రిలీఫ్‌ని గమనించాడు.

''...అని చెబుతా ననుకుంటున్నారు కదూ మిసెస్ రమాదేవి గారూ!''

ఖంగుతిన్న రమాదేవి మొహంలో భయం కొట్టొచ్చినట్లు కనబడింది.

''చెప్పండి రమాదేవి! ఎందుకు చేశారీ హత్య అసలేం జరిగింది?''

అందరూ హతాశులైపోయారు... తమ కళ్లనీ, చెవులనీ తామే నమ్మలేకపోతున్నారు..స్థాణువుల్లై చూస్తున్నారు.

''అవునూ... అవునూ... అవును- నేనే చేశానీ హత్య. ఈ చేతులతోనే ఆ దుర్మార్గుణ్ణి కాల్చిచంపాను'' హిస్టీరిక్‌గా అరిచింది రమ.

అంతా చాలా ఎమోషన్‌లోనూ, షాక్‌లోనూ ఉన్నారు. జరిగిన దాన్ని నమ్మలేక, దిగ్భ్రాంతితో ఎటువంటి రియాక్షన్ లేకుండా చూస్తున్నారు.

''డోంట్ మూవ్ ఎనీబడీ'' యుగంధర్ గొంతు ప్రతిధ్వనించింది. ''లెట్‌హర్‌టెల్... ఆమెని చెప్పనివ్వండి'' తన చేతిలో ఉన్న అతిసూక్ష్మ కాశ్మీరీ వీడియో కేమేరాతో అంతా రికార్డ్ చేస్తున్నాడు యుగంధర్.

''ఈ నాగభూషణం మీరనుకుంటున్నట్లు గొప్పవాడూ కాడు, మంచి వాడంతకంటే కాడు... వీడొక కామ పిశాచి, సెక్స్‌మేనియాక్... వీణ్ణి నేనెందుకు చంపాల్సొచ్చిందో చెబుతాను, వినండి... మీరే న్యాయం చెప్పండి'' ఆవేశం, ఆవేదన కలగలసిన స్వరంతో కొనసాగించింది.

''అత్తగారు పోయిన మొదటి రెండు మూడేళ్లూ బానే ఉన్నాడీయన... తరవాత తన విశ్వరూపం ప్రదర్శించాడు... అనుక్షణం నన్ను ఆకలి చూపులు చూస్తూ సెక్స్ కోరికలతో వేధించేవాడు.

తండ్రే దైవంగా భావించే మావారితో ఇలాంటివి చెప్పితే చచ్చినా నమ్మకపోగా నన్నే తిడతారనే భయంతో ఎలాగో భరించేదాన్ని.

కానీ, ఒక రోజు ఇంట్లో మేమిద్దరమే ఉన్నాము. పాపమ్మ కూతురికి బాలేదని రాలేదు...

ఆయన సడెన్‌గా వి.సి.డి. ఆన్ చేసి ఏదో సి.డి. పెట్టాడు... చూస్తే... అది నేను స్నానం చేస్తున్న దృశ్యం... 'ఛీ- అని తల తిప్పేసుకున్న నాకు వెంటనే కిటికీ అద్దంలోంచి టీవీలో సీన్ కనబడింది... అది ఆ ముందు రాత్రి మా బెడ్‌రూమ్‌లోని దశ్యం... కళ్లు తిరిగిపోయాయి.

చెయ్యి పట్టుకున్నాడు. కత్తిపీట తీశాను... ఆ సి.డి. తీసుకుని పారిపోయి, అందరూ వచ్చాక ఇంటికి తిరిగి వచ్చాడు.

ఆరోజు మావారు ఇంటికొస్తూనే 'తల పగిలిపోతోంది రమా' అంటూ వచ్చారు... ఒళ్లు కాలిపోతోంది. 104 డిగ్రీల జ్వరం...

'జ్వరం తగ్గాక చెబుదాములే' అని ఉద్వేగాన్నీ, ఆవేదననీ దిగమింగుకున్నాను.

తన దగ్గరున్న అతిసూక్ష్మ కాశ్మీరీ వీడియో కెమేరాతో రహస్యంగా తన గుప్త దృశ్యాలు చిత్రీకరించిన ఆ దుష్టుడంటే విరక్తి కలిగింది. కన్న కూతుర్లా చూడవలసిన నన్ను కామంతో చూసే ఆ పశువంటే జుగుప్సాద్వేషాలు కలిగాయి. దుఃఖం కట్టలు తెంచుకుంది.

ఎవరికి చెప్పినా నమ్మరు. ఏ ఆధారాలూ లేవు...మిగిలిన వాళ్లందరికీ ఆయన దేవుడు.. ఏం చెయ్యాలి? బాగా అంతర్మథనం చెందాను.

ఆ రాత్రంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను... ఆయన్ని ఎలాగైనా చంపెయ్యాలి. రిటైర్డ్ మిలట్రీ ఆఫీసర్ గదా... తుపాకీ ఉంది. దాంతోనే కాల్చి, నోరు నొక్కేసి ఆత్మహత్యగా చిత్రీకరించుదామనుకున్నాను.

కానీ నేనెళ్లి కాల్చే సమయంలో ఆయన తల తిప్పి చూడడంతో, నా గురైతే తప్పలేదుగానీ నోరు మాత్రం మూయలేక పోయాను... కర్చీఫ్‌తో తుపాకీ పట్టుకుని తలలో కాల్చాను వెధవని...

గుండు తలలోకి దూసుకుపోగానే దాన్నక్కడ పారేసి వెనకనించి మా గదిలోకి పారిపోయాను, కానీ 'రక్షించండి' అన్న కేకలని ఆపలేకపోయాను'' భోరున ఏడుస్తూ కూలబడిపోయింది రమాదేవి.

తమ తండ్రి ఇంతటి కిరాతకుడన్న వాస్తవాన్ని ఎవ్వరూ జీర్ణించుకోలేకపోతున్నారు.

పెద్దకోడలు లతకి స్పృహ తప్పినంత పనైంది.

ముందుగా తేరుకున్నది పెద్దకొడుకు రమేష్...''కానీ మిస్టర్ యుగంధర్... ఇది మీరెలా తెలుసుకోగలిగారు?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''ఆ రోజు మీ నాన్నగారి గది వెదుకుతూంటే ఆయన కూర్చున్న కుర్చీమేకుకి ఉంగరాలు తిరిగిన జుట్టు వెంట్రుకలు చిక్కుకుని కనిపించాయి. అదే నేను జేబులో పెట్టిందా రోజు. అలా ఉంగరాలు తిరిగిన జుట్టు ఈ ఇంట్లో ఒక్క రమాదేవికే ఉంది...

కానీ ఆ ఒక్కదాని వల్ల ఏం సాధించగలం? అనుమానం ఉంది కాబట్టి ఇంటరాగేట్ చేసేవాళ్లం... బయటపడి ఉండేదే... కానీ, ఇంకా ఏదైనా క్లూ దొరుకుతుందేమోనని, మీ నాన్నగారి బ్యాంక్ ఎక్కౌంట్లు వగైరాలన్నీ చూశాము.

ఆంధ్రా బ్యాంక్‌లో ఉన్న ఆయన లాకర్‌ని ఓపెన్ చేయించి చూస్తే ఈ చిన్న కాశ్మీరీ సూక్ష్మకెమేరా, ఈ సి.డి. దొరికాయి...

ఆ సి.డి. వల్ల మొత్తం కథంతా అర్థమైంది. ఉంగరాల జుట్టు రమాదేవికి ఉండటం, సి.డి.లో కూడా ఆవిడే ఉండటంతో తీగ లాగితే డొంకంతా కదిలినట్లైంది. మా అనుమానాలు నిజమయ్యాయి.

కానీ, ఇందులో ఆమెకి వేరే ఎవరన్నా సహాయపడ్డారేమో తెలుసుకోవాలని మీ అందరి సమక్షంలో అడిగి ఆవిడ చేతనే నిజం చెప్పించాను.

మిగతా వాళ్లెవరికీ ఈ హత్యతో అణుమాత్రం కూడా సంబంధం లేదని బుజువైంది''

యుగంధర్ మొహంలో విజయగర్వం తొణికిసలాడింది.

మిస్టరీని ఛేదించిన బాస్ వంక అభినందనా పూర్వకంగా చూశాడు జానకిరామ్...

హత్యకు కారణాలు, సాక్ష్యాలు విన్న ధర్మాసనం సి.బి.ఐ.ని అభినందించి, తమ చట్టాల కనుగుణంగా తీర్పు చెప్పింది.

*